## క్లుప్తంగా

### పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి



ఆలూరు మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

ఆలూరు రూరల్: పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేయాలని మండల ఎంఈఓ–2 చిరంజీవి రెడ్డి మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్ సుధారాణికి సూచించారు. సోమవారం ఆయన మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం హాస్టల్‌లో వసతులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.

### బదిలీ ఉద్యోగికి సన్మానం



రాఘవేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

వెల్దుర్తి(కృష్ణగిరి): చేసిన సేవలే గుర్తింపును ఇస్తాయని లైన్ ఇన్‌స్పెక్టర్లు ధనుంజయగౌడ్, శ్రీనివాసులు అన్నారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై కర్నూలుకు వెళ్తున్న రాఘవేంద్రప్రసాద్‌ను తోటి ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. లైన్‌మెన్లు, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

### పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసుకోండి

హొళగుంద: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు రూ.200కే పోస్టాఫీసులో ఎన్‌పీసీఐ లింక్ అకౌంట్‌ను పొందవచ్చని పోస్ట్‌మాస్టర్ వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక పాత పోలీస్‌స్టేషన్ ఎదుట ఎన్‌పీసీఐ లింక్ అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డ్, ఫొటోలు లేకుండా కేవలం ఆధార్ నెంబర్‌తో అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చన్నారు.

### మార్కెట్ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయండి



మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

మద్దికెర : గ్రామంలో రూ.18 లక్షలతో చేపట్టిన కూరగాయల మార్కెట్ పనులు సకాలంలో పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని నాబార్డు జిల్లా డీడీఎం సుబ్బారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రధాన బజారులో నాబార్డు నిధులు రూ.15 లక్షలు, దాతల సహకారం రూ.3 లక్షలతో చేపట్టిన మార్కెట్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడు తూ ఇప్పటికే 95 శాతం పనులు పూర్తి కావడం సంతోషకరమన్నారు. సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపీడీఓ కొండయ్య, బ్యాంకు మేనేజర్ వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

### పేటీఎం ద్వారా 'స్త్రీ నిధి' రుణాల చెల్లింపు

తుగ్గలి : స్త్రీ నిధి రుణాలు తీసుకున్న స్వయంశక్తి సంఘాలు రుణ చెల్లింపువాయిదాలను పేటీఎం యాప్ ద్వారా చెల్లించవచ్చని వెలుగు ఏపీఎం రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..స్త్రీ నిధి రుణాలు రికవరీ డిజిటల్ విధానంలో జరగాలన్నారు. మండలంలో మొత్తం 1,347 సంఘాల్లో 14,531 సభ్యులు ఉన్నారని తెలిపారు. లింకేజీ రుణాలు రూ.20 కోట్లు లక్ష్యంగా కాగా, ఇప్పటి వర కు 11.85 కోట్లు ఇచ్చామన్నారు. స్త్రీ నిధి రుణాల పంపిణీ రూ.6కోట్లు లక్ష్యంగా ఇప్ప టి వరకు 174 సంఘాల్లోని 608 మంది సభ్యులకు రూ.3.74కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. సక్రమంగా చెల్లించే సంఘాల సభ్యులకే స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.

### బ్రహ్మగుండానికి పాదయాత్ర

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామ సుభిక్షం కోసం పాదయాత్ర చేపట్టినట్లు మాజీ ఎంపీపీ బొమ్మన దశరథరామిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అయ్యప్పస్వామి గుడి నుంచి అయ్యప్ప భక్తులు బియ్యం, బ్యాళ్లు, నూతన వస్త్రంతో పాదయాత్రగా వెళ్లారు. ఏటా కార్తీక మాసం చివరి సోమవారం ఇలా పాదయాత్ర చేపడుతున్నట్లు వారు తెలిపారు. అయ్యప్ప, శ్రీరామ, శివ నామస్మరణ చేస్తూ బ్రహ్మగుండానికి చేరుకుని కామేశ్వరి సమేత బ్రహ్మేశ్వరస్వామికి బియ్యం, బ్యాళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. రమాకాంత్‌రెడ్డి, బలరాంగౌడ్, తిరువీధి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

### నేడు సీఈఓలతో సమావేశం

ఆలూరు: స్థానిక కేడీసీసీ బ్యాంకు ఆవరణలో మంగళవారం సాయంత్రం సహకార సంఘాల కార్యదర్శులతో (సీఈఓలు) సమావేశం నిర్వహిస్తున్నట్లు కేడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ మహ్మద్ బాషా సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆలూరు,ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, చింతకుంట గ్రామాలకు చెందిన సీఈఓలతో పెండింగ్ రుణాల వసూళ్లపై సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రవిప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు.

# జింకల పార్కు ఇంకెప్పుడు?

- వందల సంఖ్యలో పైర్లపై దాడి చేస్తున్న లేళ్లు
- రాత్రిళ్లు కునుకు లేకుండా కాపలా కాస్తున్న రైతులు
- 2014 ఎన్నికల సమయంలో జింకల పార్కు ఏర్పాటుపై చంద్రబాబు హామీ
- నేటికీ నెరవేరని వైనం
- ఆలూరు,పత్తికొండ నియోజకవర్గాల్లో 90 వేల హెక్టార్లలో పంటల సాగు

**హామీలు విస్మరించడంలో** చంద్రబాబు నాయుడిది ప్రత్యేక స్థానం. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో జింకల పార్కు ఏర్పాటు చేస్తామని 2014 ఎన్నికల సమయంలో హామీనిచ్చారు. 2019 వరకు పాలించినా, మళ్లీ ఇప్పుడు అధికారంలో వచ్చినా ఆ ఊసే లేదు. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో జింకల బెడద తీవ్రంగా ఉంది. నిత్యం పంట పొలాలపై దాడులు చేసి పైర్లను తినేసి నష్టపరుస్తున్నాయి. వాటి నుంచి రక్షించాలని రైతులు ఏళ్లుగా వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.



ఆలూరు మండలం గోనేహాల్ గ్రామ సమీప శనగ పంట పొలాల్లో సంచరిస్తున్న జింకలు

ఆలూరు రూరల్: ఆరుగాలం శ్రమించి రైతులు సాగు చేసిన పంటలపై జింకలు వందల సంఖ్యలో దాడి చేసి మొక్క, మొగ్గ దశలో ఉన్న పంటలను తినేస్తున్నాయి. చంపితే చట్టం అడ్డం వస్తోంది. వదిలేస్తే పంట నష్టమవుతోంది. దీంతో అన్నదాతలు ఏం చేయలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. రాత్రింబవళ్లు కంటికి కునుకు లేకుండా పొలాల్లో ఉండి జింకల బారి నుంచి పంటలను కాపాడుకుంటున్నారు. వేలకు వేలు వెచ్చించి పంటల సాగు చేస్తే జింకల వల్ల పెట్టుబడి నేలపాలవుతోంది. రోజురోజుకు వాటి సంతతి పెరుగుతుండడంతో ఆహారం లేక పంట పొలాలపై పడుతున్నాయి. జింకల బెడద నుంచి కాపాడాలని పలుమార్లు వేడుకున్నా..పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో రైతులు 90 వేల హెక్టార్లలో పప్పుశనగ, జొన్న తదితర పంటలను సాగు చేశారు. ఆలూరు,ఆస్పరి,చిప్పగిరి,హాలహర్వి, మద్దికెర, పత్తికొండ,తుగ్గలి మండలాల్లో జింకల బెడద అత్యధికంగా ఉందని రైతులు వాపోతున్నారు.

**కలగానే జింకల పార్కు హామీ..**

ప్రతి ఏడాది ఖరీఫ్,రబీ సీజన్‌లలో రైతులు సాగు చేసిన పంటలపై జింకలు మందలు మందులుగా వచ్చి పొలాలను పాడుచేస్తున్నాయి. ప్రతి సారి జరుగుతున్న పంట నష్టాన్ని నివారించేందుకు జింకల బెడద నుంచి కాపాడాలని రైతులు పాలకులకు విన్నవించారు. ఇందులో భాగంగానే 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా చేపట్టిన వస్తున్నా.. మీకోసం పాదయాత్రలో భాగంగా ఆలూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో జింకల బెడద నుంచి రైతులను కాపాడుతానని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే హొళగుంద మండలంలోని దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేస్తానని మాటిచ్చారు. గెలిచిన తర్వాత జింకల పార్కు ఏర్పాటు ప్రతిపాదనలకు కూడా నోచుకోలేదు. రైతులు ఎన్నిసార్లు స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మరోసారి ప్రతిపక్ష



ఆలూరులోని ఫారెస్టు కార్యాలయం

నాయకుడి హోదాలో ఆలూరుకు వచ్చిన చంద్రబాబుకు ఈ సారి ఖచ్చితంగా జింకల పార్కు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ మాట కూడా ప్రస్తావించకపోవడాన్ని చూసి మరోసారి మోసపోయామని రైతులు పేర్కొంటున్నారు.

**2006లో ఆపరేషన్ బ్లాక్‌బక్‌తో జింకల పట్టివేత**

2006లో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల వినతి మేరకు జింకల బెడదపై స్పందించారు. ఆపరేషన్ బ్లాక్‌బక్ పేరుతో జింకల పట్టేందుకు రూ.2 కోట్లు విడుదల చేశారు. స్థానికంగా ఉన్న కూలీలు,రైతుల ద్వారా జింకల పట్టే కార్యక్రమం చేపట్టారు. ఒక్కో జింక పట్టుకున్న వారికి రూ.500 వరకు అందించారు. వాటిని బోనల్లో బంధించగా.. ఫారెస్టు అధికారులు నల్లమల అడవిలో వదిలేశారు. ఈ కార్యక్రమం ఏడాది పాటు సాగింది. దీంతో పంటలు సాగు చేసిన రైతులకు కొంత మేర ఊరట లభించింది. కొన్ని రోజుల తర్వాత జింకలు పట్టేందుకు కూలీలు ముందు రాకపోవడంతో ఆ కార్యక్రమం ముందుకు సాగలేదు.

#### 20 ఎకరాల్లో పప్పుశనగ సాగుచేశా



నాకు ఉన్న 20 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. పంట పూత దశలో ఉంది. రాత్రి సమయాల్లో జింకలు పొలంలో సంచరించి పంటను తినేస్తున్నాయి. వందల సంఖ్యలో ఒక్కసారిగా పొలాల్లోకి వచ్చి తొక్కుతుండడంతో మొక్కలు చనిపోతున్నాయి. ఎకరాకు రూ. 60 వేల వరకు ఖర్చు చేసి సాగు చేశాను. జింకల బెడద వల్ల కంటికి కునుకు లేకుండా పోయింది.

– కృష్ణ రైతు,మద్దికెర

#### పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు రాలేదు

ఆలూరు రిజర్వ్ ఫారెస్టులో జింకలు లేవు. కేవలం రెవెన్యూ భూముల్లోనే సంచరిస్తున్నాయి. దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటుకు ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. జింకల బెడదపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఈ ప్రాంతంలో జింకల సంఖ్య ఎంత ఉందో తెలియదు.

– శ్రీనివాసులు, ఆలూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి

#### జింకల పార్కు ఏర్పాటు చేయాలి



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలూరుకు వచ్చిన ముఖ్యమంత్రి జింకల పార్కు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. 2014లో ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. పంట పొలాలపై జింకలు దాడి చేసి పైర్లను నాశనం చేస్తున్నాయి. ఏటా రబీ సీజన్‌లో రైతులకు జింకల బెడద తప్పటం లేదు. ఆలూరు ప్రాంతంలో ఎక్కువగా పప్పుశనగ సాగు చేస్తారు. పంట సాగు మొక్క దశ నుంచి దిగుబడి వచ్చే వరకు పొలాల్లో కాపలా ఉండాల్సిన పరిస్థితి. ముఖ్యమంత్రి చంద్రబాబు జింకల పార్కు హామీ నెరవేర్చి రైతులను కాపాడాలి.

– వీరభద్రి, రైతు,గోనేహాల్

#### రాత్రిపూట కాపలా ఉంటున్నా



నాలుగు ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను.ఎకరాకు రూ.60 వేలు ఖర్చు చేశాను. ప్రస్తుతం పంట మొగ్గ దశలో ఉంది. సాయంకాలం నుంచి జింకలు వందల సంఖ్యలో ఒక్కసారిగా పంట పొలాల్లోకి వస్తున్నాయి. దీంతో పైర్లు నాశనం అవుతున్నాయి. రాత్రి పూట వీటి సంచారం అధికంగా ఉంటోంది. దీంతో సాయంత్రం నుంచి తెల్లవారు జామున వరకు పంట పొలానికి కాపాలా ఉంటున్నా. వాటిని ఏమి చేయలేని పరిస్థితి. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. పాలకులు స్పందించి జింకల బారి నుంచి పంటలను కాపాడాలి.

– మోతి సుంకన్న,ఆలూరు

## లింగ వివక్షతో మహిళాభివృద్ధికి ఆటంకం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



దేవనకొండలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు, అధికారులు

తుగ్గలి : లింగ వివక్షతో మహిళాభివృద్ధికి ఆటంకమని, చట్టాలు అమలు చేయడం ఎంత ముఖ్యమో సమాజంలో మార్పు రావడం కూడా అంతే ముఖ్యమని తహసీల్దార్ రమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ×జెండర్ ఆధారిత హింస× నిర్మూలనపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విశ్వమోహన్, ఈవోపీఆర్డీ శ్రీహరి, ఎస్ఐ కృష్ణమూర్తి, వెలుగు ఏపీఎం రాధాకృష్ణ, ఎంఈవో–2 రమావెంకటేశ్వర్లు, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. బాలికల్లో అక్షరాస్యత పెంచడం ద్వారా స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం సాధించడం సులభతరమవుతుందన్నారు.

మద్దికెర : జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్, ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎవరైనా లింగ ఆధారిత హింసకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): లింగ అసమానత, వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సుహాసినమ్మ పిలుపునిచ్చారు. సోమవారం పలు శాఖల ఆధ్వర్యంలో ×జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం× కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ 23వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం వచ్చేలా ప్రచారం చేయాల్సి ఉందన్నారు.ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఎం అనురాధ, సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

దేవనకొండ: జెండర్ ఆధారిత హింస నూతన చైతన్యం 3.0 మార్పు కోసం ముందడుగు అనే కార్యక్రమం గురించి తహసీల్దార్ లోకేశ్వరరావు, ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ, అక్కడ మానవహారం నిర్వహించారు. ఏఓ సురేష్‌బాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి, హెచ్‌డీసీసీ నరసన్న, ఎఫ్‌పీవో సీసీ ప్రభాకర్, జీసీసీఎస్ మస్తాన్ పాల్గొన్నారు.

హాలహర్వి: ప్రజలందరూ సమానమేనని, లింగబేధం చూడరాదని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నయా చేతన్ (జెండర్ వ్యతిరేక కార్యక్రమాల మాసోత్సవాలు) చేపట్టారు. కోర్ కమిటీ సమావేశం జరిగింది. సభ్యులందరితో జెండర్ ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు.తహసీల్దార్ నజ్మాబాను పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: స్త్రీ హింస నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ దిలీప్ కుమార్, ఆర్డీటీ అనంతపురం సెక్టార్ డీఐడీ రఫీక్ అన్నారు. సోమవారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్త్రీ హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. న్యాయవాది షాకీర్, మహిళలు పాల్గొన్నారు.

చిప్పగిరి: లింగ వివక్ష చూపుతూ మహిళలను హింసించడం తగదని ఎంపీడీఓ అల్లాబకాష్ అన్నారు. సోమవారం వెలుగు ఏపీఎం నాగార్జున ఆధ్వర్యంలో జెండర్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపిడీఓ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్, ఈఓపీఆర్డీ బాలన్న,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన,ఏఈ భవ్య,పంచాయతీ కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.

## ఆర్థిక సంఘం నిధులు విడుదల



మాట్లాడుతున్న డీఎల్‌పీవో వీరభద్రప్ప

పత్తికొండ(తుగ్గలి) : డివిజన్‌లోని పంచాయతీలకు 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్రప్ప తెలిపారు. పట్టణంలోని 4వ సచివాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. డివిజన్‌లోని 9 మండలాల్లో 155 పంచాయతీలకు (నాలుగు పంచాయతీలు మినహా) మిగిలిన పంచాయతీలకు రూ.10,98,94,508 మంజూరైందన్నారు. ఆస్పరి మండలంలోని అట్టేకల్లు, బిణిగేరి, చిరుమాన్‌దొడ్డి, తుగ్గలి మండలంలో రాంపల్లి పంచాయతీల్లో ఆడిట్ క్లోజ్ కానందున ఆ నాలుగు పంచాయతీలకు నిధులు మంజూరు కాలేదన్నారు. మంజూరైన నిధుల్లో టైడ్ కింద తాగునీరు, పారిశుద్ధ్యం పనులకు 60 శాతం నిధులు, బేసిక్ కింద 40 శాతం నిధులు ఖర్చు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటి పన్ను వసూలు లక్ష్యం రూ.4 కోట్లుగా నిర్ణయించారని, వచ్చే ఏడాది మార్చిలోపు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చామని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచి అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి వచ్చేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## గ్రామ సింహద్వారం నిర్మాణానికి భూమిపూజ



ఆస్పరిలో ఊరువాకిలి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఆస్పరి: స్థానిక పంచాయతీ సింహద్వారం నిర్మాణానికి సోమవారం సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. మూడు శతాబ్దాలుగా కలగా మిగిలిన ఊరువాకిలి నిర్మాణానికి పూనుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు, గ్రామపెద్దలు సహకారంతో రూ.30 లక్షలతో చేపట్టే నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని సర్పంచ్ తెలిపారు. అంతకు ముందు గ్రామ దేవత మారెమ్మవ్వ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలతో కళశాన్ని ఊరేగింపుగా సింహద్వారం నిర్మాణం చేపట్టే ప్రాంతానికి తీసుకొచ్చి పూజలు చేశారు.ఆస్పరి సీఐ మస్తాన్‌వలి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు తిమ్మన్న, దత్తాత్రేయరెడ్డి, వెంకటరమణ, ప్రకాష్‌రెడ్డి, కేశవరెడ్డి, మేకల రంగనాథ్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం

తుగ్గలి : మండలంలోని కడమకుంట్లలో సీసీ రోడ్డు పనులను సోమవారం మాజీ సర్పంచ్ పక్కీరప్ప ప్రారంభించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.9లక్షలతో పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

### వీఆర్‌ఏలపై సస్పెన్షన్ ఎత్తివేత

హొళగుంద: కొన్ని నెలలుగా అనివార్య కారణాలతో సస్పెండ్ అయిన వీఆర్‌ఏలు మల్లయ్య, సిద్ధలింగల సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లో తీసకోవడంపై వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి, మండల వీఆర్‌ఏలు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దారు సతీష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

### పనులను అడ్డుకోవద్దు

హొళగుంద: ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేసే పనులను అడ్డగించడం మంచిది కాదని, వెంటనే డ్రైనేజీ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని స్థానిక దిడ్డి కాలనీ వాసులు ఎంపీడీఓ విజయలలితను కోరారు. సోమవారం కాలనీ ప్రధాన రోడ్డులో పాత డ్రైనేజీ పక్కనే కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించారు. అక్కడ మరో డ్రైనేజీ నిర్మాణానికి పీఆర్ ఏఈ యమునప్ప అనుమతి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని పనులు చేస్తున్న అబ్దుల్ సుభాన్ ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లాడు. ఇక్కడ రోడ్డు వెడల్పు చేస్తే బాగుంటుందని కాలనీ వాసులు ఆమె దృష్టికి తెచ్చారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డును వెడల్పు చేస్తే ఇబ్బందులు తప్పుతాయని చెప్పారు.

### ఘనంగా గ్రామోత్సవం

మద్దికెర : మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారి 18 మెట్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామి చిత్ర పటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆలయాల్లో కార్తీక పూజలు



వెల్దుర్తిలో నిర్వహించిన లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలందుకుంటున్న చౌడేశ్వరి దేవి

హొళగుంద: స్థానిక పేట బసవేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక మాస చివరి సోమవారాన్ని పురస్కరించుకుని దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముందు భక్తులు స్వామి వారికి మహామంగళ హారతి, నైవేద్య సమర్పణ, ఇతర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో భక్తులు వివిధ ఆకారాల్లో దీపాలను వెలిగించారు.

దేవనకొండ: కార్తీకమాసం చివరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పి.కోటకొండ గ్రామంలోని రాంబావిరామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. శ్రీ లక్ష్మి కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయ మాజీ చైర్మన్, కోటకొండ సచివాలయం మాజీ కన్వీనర్ ఆర్.హనుమంతరెడ్డి, గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

మద్దికెర : మండలంలోని మద్దికెర, పెరవలి, బుగ్గ సంగమేశ్వరంలోని శివాలయాలు కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులతో కిక్కిరిశాయి. మహిళలు దీపాలు వెలిగించి ముక్కంటీశుడికి కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయాలలో వివిధ ఆకృతులలో ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు. స్థానిక చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు ఆంజనేయులు పూజలు చేపట్టారు.



బుగ్గసంగమేశ్వరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



హొళగుంద పేట బసవేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగించిన దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): కార్తీక మాసంలో హరికి దీపం పెట్టడం వల్ల అపరిమితమైన ఐశ్వర్యం లభిస్తుందని ఇస్కాన్ తిరుపతి మందిర ఉపాధ్యక్షుడు రూపేశ్వర చైతన్యదాస్ అన్నారు. వెల్దుర్తిలోని బాలుర హైస్కూల్‌లో కర్నూలు ఇస్కాన్– అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్తీక దామోదర లక్ష దీపోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు ఎల్ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్, పుష్పావతి హాజరయ్యారు.

## సెల్‌ఫోన్‌తో మానసిక స్థితిపై ప్రభావం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్

ఆలూరు రూరల్: సెల్‌ఫోన్ వాడకం మానసిక స్థితి, శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతోందని ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో సామాజిక మాధ్యమం–లాభ నష్టాలు అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు. దశాబ్దం క్రితం విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో మునిగితేలేవారన్నారు. నేడు వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లలు,పెద్దలు సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియాతో కాలక్షేపం చేస్తున్నారని చెప్పారు. దీంతో శారీరక, మానసిక సమస్యలపై తీవ్ర ప్రభావం చూపి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఇంటర్నెట్‌ను చదువు పరంగా సందేహాలు నివృత్తి కోసం వాడుకుంటే లక్ష్యాలను చేరుకోగలతారని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది రవి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి అధ్యాపకులు సుశీల, లక్ష్మీనరసమ్మ, డా.రాఘవేంద్ర,డా.మద్దప్ప పాల్గొన్నారు.

### 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కృష్ణగిరి: తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని 104 ఉద్యోగులు కోరారు. ఈ మేరకు సోమవారం కంబాలపాడులో ఎమ్మెల్యే శ్యాంకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. అలాగే తమకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించాలని 104 ఉద్యోగులు వెంకటేశ్వర్లు, ఓబులేసు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

### ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మద్దికెర : అపార్ నమోదు కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్‌లో సవరణల కోసం ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆపద్బంధు సేవాసమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ హుసేన్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆధార్, ధ్రువ పత్రాల్లో ఉన్న తేడాల సవరణకు ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. అలాగే నోటరీ అఫిడవిట్ అవసరం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.